క్లుప్తంగా

నిశ్చితార్థ వేడుక



వేడుకల్లో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం పాతపేట మాజీ సర్పంచ్ వెంకటరమణ కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

పుంగనూరు: పట్టణంలోని బస్టాండు వద్ద ఉన్న శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఈవో కమలాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్చకులు, ప్రజల సమక్షంలో లెక్కింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి



సదుం: దెబ్బతిన్న వరిపొలం

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె పంచాయతీ పరిధిలో ఆదివారం వేకువ జామున పంట పొలాలపై ఏనుగులు దాడి చేశాయి. ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు దెబ్బతిన్న పంటలను చూసి విలపించారు. గ్రామానికి చెందిన యాగవేంద్రరెడ్డికి చెందిన వరి, వంగ, రమణకు చెందిన వరి, లక్ష్మీదేవికి చెందిన చెరకుతోటపై ఏనుగులు దాడి చేయడంతో పంటలు దెబ్బతిన్నాయి.

29న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపల్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈనెల 29న ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చౌడేపల్లె: కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ ఆదివారం తెలిపారు. చౌడేపల్లె బోయకొండ ఆర్చి వద్ద కర్ణాటక మద్యంను విక్రయిస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఒక వ్యక్తి వద్ద 20 ప్యాకెట్లు మద్యం స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశామన్నారు. విచారణలో నిందితుడు పెద్దపంజాణి మండలం రాయలపేట గొరీనగర్‌కు చెందిన బుటకపల్లె దొరస్వామిగా గుర్తించామన్నారు. నిందితుడుని పుంగనూరు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ

కరెంటు బిల్లుల ద్వారా రూ.5 లక్షలు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సౌకర్యం కోసం ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ పరిధిలోని ఈఆర్వో, ఏఈ కార్యాలయాల్లో వినియోగదారులు బిల్లులు చెల్లించారు. మొత్తం 1300 బిల్లులు చెల్లించగా తద్వారా ఆ శాఖకు రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చిందని ఈఈలు పద్మనాభపిళ్లై, హరి తెలిపారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు



పలమనేరు: పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

29 నుంచి బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29తో ప్రారంభమై, ఏప్రిల్ 9వతేదీతో ముగుస్తాయి. ప్రతిరోజు ఉదయం, రాత్రి వివిధ రూపాల్లో వాహనాల్లో స్వామి వారు విహరించనున్నారు. 29న విష్వక్సేన తిరుమంజనం, ఉత్సవం, 30న శ్రీరామనవమి, సింహ వాహన సేవ ఉంటుంది.

రూ.50 కోట్లతో సుందర పుంగనూరు

- ఏడు కిలోమీటర్ల ఎంబీటీ రోడ్డు విస్తరణ
- డివైడర్లు, సర్కిళ్లు, వీధిలైట్ల ఏర్పాటు
- ఇప్పటికే బైపాస్‌లో అభివృద్ధి పరుగులు
- పట్టణ జనాభా 62 వేలు, వార్డులు 31



పుంగనూరులో విస్తరించనున్న ఎంబీటీ రోడ్డు

సుమారు మూడు దశాబ్దాలుగా రాజకీయ కక్షలతో అభివృద్ధికి నోచుకోని పుంగనూరు పట్టణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహర్దశ పట్టింది. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి అభివృద్ధికి శ్రీకారం చుట్టి సుందర పట్టణంగా తీర్చిదిద్దుతున్నారు. పట్టణంలో సుమారు 62 వేల మంది జనాభా ఉన్నారు. 31 వార్డులు ఉన్నాయి. చేశారు. ఏడు కిలోమీటర్ల ఎంబీటీ రోడ్డును రూ.50 కోట్లతో విస్తరించే పనులు ప్రారంభం కానుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

పుంగనూరు: పుంగనూరు పట్టణ అభివృద్ధిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. పట్టణ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి నిధులు మంజూరు చేయిస్తున్నారు. పట్టణ సమీపంలోని భీమగానిపల్లె, రాంపల్లె మీదుగా పట్టణంలోని కొత్తయిండ్లు, గోకుల్‌సర్కిల్, ఇందిరాసర్కిల్, తూర్పుమొగశాల మీదుగా బాలాజీ థియేటర్ నుంచి అరబిక్ కళాశాల వరకు 7 కిలోమీటర్ల ఎంబీటీ రోడ్డు ఉంది. ప్రస్తుతం సుమారు 60 అడుగుల రోడ్డు ఉంది. దీన్ని విస్తరించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి రూ.50 కోట్లు విడుదల చేయించారు. పట్టణ ప్రజలు ఎవరు నష్టపోకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులకు ఎంపీ ఆదేశాలు జారీ చేశారు. అలాగే రోడ్డు మధ్య భాగంలో డివైడర్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, ఇందిరా సర్కిల్, తూర్పుమొగశాల ప్రాంతాల్లో సర్కిళ్లను ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరీకరణ చేయనున్నారు. పుంగనూరుకు శాశ్వతమైన గుర్తింపు తీసుకొస్తామని ఎంపీ స్పష్టం చేశారు.

ఊహించని అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పుంగనూరు బైపాస్ రోడ్డును ఎంపీ మిథున్‌రెడ్డి దగ్గరుండి పూర్తి చేయించారు. భీమగానిపల్లె నుంచి అరబిక్ కళాశాల వరకు బైపాస్‌రోడ్డు వేశారు. అలాగే పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి కోర్టు రోడ్డు, తేజ ఆస్పత్రి, ఫారెస్ట్ ఆఫీసు వరకు డబుల్ రోడ్డును సుమారు రూ.6 కోట్లతో నిర్మించి డివైడర్లు, ఎల్‌ఈడీ లైట్లు, మొక్కలు ఏర్పాటు చేశారు. ఆప్రాంతాల్లో ప్రస్తుతం భూముల ధరలు ఆకాశానంటుతున్నాయి. ఒక్కసారిగా ప్రజలు కోటీశ్వరుగా మారిపోయారు.

రూ.3 కోట్లతో పార్కు

పట్టణంలోని ప్రజలకు ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటు చేసేందుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చర్యలు తీసుకున్నారు. పుంగమ్మ చెరువు కట్టపై నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు ప్రత్యేకమైన రహదారి ఏర్పాటు చేసి మొక్కలు, లైట్లు, బెంచీలు, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం రూ. 3 కోట్లు విడుదల చేశారు.

పుంగనూరును మరువలేం



మా కుటుంబానికి ఎన్నో పదవులు అందిస్తున్న పుంగనూరు ప్రజల సహకారాన్ని మరువలేం. వారికి మా కృతజ్ఞతలు. ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తూ పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో పుంగనూరును అన్ని విధాల అభివృద్ధి చేసి చరిత్ర పుటలలో స్థానం ఏర్పాటు చేస్తాం.

–మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

నాలుగేళ్లలో అభివృద్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరుకు ఊహించని విధంగా రూ.కోట్ల నిధులు విడుదల చేసి అభివృద్ధి చేశారు. పట్టణాన్ని సుందరంగా తయారు చేసేందుకు బైపాస్‌రోడ్లు, విస్తరణ పనులు, పార్కు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. గతంలో లేని గుర్తింపు పుంగనూరుకు పెద్దిరెడ్డి కుటుంబంతో రావడం మా అదృష్టం.

–ఎన్. వెంకటరెడ్డి యాదవ్, పీకెఎం ఉడా చైర్మన్

నేటి నుంచి గృహసారథుల సమావేశం

చౌడేపల్లె: గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సోమవారం నుంచి రెండురోజుల పాటు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో గతంలో నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల మార్పులు, చేర్పులపై చర్చించి కొత్తవారిని ఎంపిక చేయనున్నారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హాజరు కానున్నారు. సోమవారం ఏ.కొత్తకోట, దుర్గసముద్రం, చారాల, ఆమినిగుంట, చౌడేపల్లె, వెంగళపల్లె, కొండామర్రి, గడ్డంవారిపల్లె, పరికిదొన సచివాలయాల్లో సమావేశాలు జరుగుతాయి. మంగళవారం పుదిపట్ల, చింతమాకులపల్లె, కాటిపేరి, కాగతి, దిగువపల్లె సచివాలయాల్లో సమావేశాలు ఉంటాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహ సారథులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం విడుదల చేసిన ప్రకటలో తెలిపారు.

రేపు సంత నిర్వహణ వేలం

సోమల: సోమల వారపు సంత, ప్రవేటు బస్టాండు నిర్వహణకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, సర్పంచ్ రాజేశ్వరీ ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఒకటో సచివాలయంలో ఉదయం 11 గంటలకు అధికారుల ఆధ్వర్యంలో వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేకం

శాంతిపురం: బెండనకుప్పంలో నూతనంగా నిర్మించిన శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం, శిలా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ, కలశస్థాపన, నవగ్రహ హోమం, కుంభాభిషేకాలను అర్చకులు లక్ష్మీకాంతస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. గ్రామస్తులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి శ్రీఅభయ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.



విశేష అలంకరణలో స్వామి వారు

30న శ్రీరామనవమి మహోత్సవం

సదుం: మండలంలోని తాటిగుంటపాలెం కోదండ రామాలయంలో ఈనెల 30న శ్రీరామ నవమి మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు, శ్రీశైల దేవస్థానం ఈఓ లవన్న ఆదివారం తెలియజేశారు. ఆరోజు ఉదయం 7 గంటలకు గణపతిపూజ, అభిషేకం, 8 గంటలకు పంచామృతాభిషేకం, 9 గంటలకు విశేష హోమం, 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకు గ్రామోత్సవం ఉంటుందని చెప్పారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు బీసీ కాలనీ సమీపంలో ఆదివారం పేకాట శిబిరంపై సిబ్బందితో కలసి కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి, రూ.3,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముమ్మరంగా పశువులకు టీకాలు

శాంతిపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి(ఎఫ్ఎండీ) ప్రబలకుండా ముందస్తు టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి చాహతుల్లా తెలిపారు. ఆదివారం ఎం. శాంతంపల్లెలో సర్పంచ్ మురళి ఆధ్వర్యంలో పశువుకు గోపాలమిత్ర శ్రీనివాసులు టీకాలు వేశారు. ఈ సందర్భంగా చాహతుల్లా మాట్లాడుతూ మండలంలో దాదాపు 15 వేల ఆవులు, ఎద్దులు ఉండగా, ఇప్పటి వరకు 10,500 పశువులకు టీకాలు వేశామన్నారు. సచివాలయ పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రల సహకారంతో వారం రోజుల్లోపు మిగతా వాటికి కూడా టీకాలను వేస్తామని తెలిపారు. మూడు రాష్ట్రాల కూడలి కావడం, ఈ ప్రాంతంలో పశువుల సంతలు జరుగుతుండడంతో రోగం ప్రబలే ప్రమాదం ఉండడంతో ముందస్తు చర్యగా టీకాలు వేస్తున్నామన్నారు.

అడవి పందుల మృతి

సోమల: సోమల–నంజంపేట మార్గంలో అడుసుపల్లె వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో రెండు అడవి పందులు మృతి చెందాయి. ఈమేరకు స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌బీఓలు రామచంద్ర, శోభానాద్రి, పశువైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని కళేబరాలను పరిశీలించారు. పోస్టు మార్టం నిర్వహించి ఖననం చేశారు.

శివాలయంలో నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలో ప్రముఖ శైవక్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ, ఆలయ ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం ఉదయం రాహు కాల సమయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

గురుకుల ప్రవేశానికి గడువు పెంపు

రామకుప్పం: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆంగ్ల మాధ్యమంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మన్సూర్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీ ఉంటుందని, వివరాలకు 97045 50107 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం

చిత్తూరు కలెక్టరేట్ : యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. స్థానికంగా కట్టమంచిలో ఉన్న ఓ ప్రైవేట్ కళ్యాణమండపంలో ఆదివారం ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాలను నిర్వహించారు. అనంతరం చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఇలా.

ఎన్నికల అధికారి యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, ఎన్నికల పరిశీలకులు యుటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి టి రఘుపతి రెడ్డి ఈ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎం.సోమశేఖర్ నాయుడు (ఐరాల మండలం), ప్రధాన కార్యదర్శిగా జీవి రమణ (చిత్తూరు), గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి (తవణంపల్లె) సహాధ్యక్షులుగా మునిరత్నం (నగరి), రెహానా బేగం (యాదమరి), కోశాధికారి గా ఓ.ప్రసన్న కుమార్ (గంగవరం), కార్యదర్శులుగా కృష్ణమూర్తి (వి.కోట), ఇ.జగన్మోహన్ రెడ్డి (చౌడేపల్లి), కె.రెడ్డెప్ప నాయుడు (పూతలపట్టు), గాలి సురేష్ (కుప్పం), దక్షిణామూర్తి (చిత్తూరు) ఓ.రూప (కార్వేటినగరం) ఎన్నికయ్యారు.



సోమశేఖర్‌నాయుడు, జీవీ రమణ

దుర్గాలమ్మ ఆలయంలో చోరీ

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రంలో ఉన్న దుర్గాలమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ గేటును పగులగొట్టి లోపల ఉన్న హుండీని అపహరించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారికి పూజ చేయడానికి వచ్చిన భక్తురాలు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

లాభాల దిగుబడి

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత గ్రామ పంచాయతీ జగడంవారిపల్లెల్లో వేరు శగన లాభాల దిగుబడిని ఇచ్చింది. రైతు హరినాథ్ మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. పంట దిగుబడి బాగా వచ్చింది. మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు కోసం సుమారు రూ.1.2 లక్షలు ఖర్చు చేస్తే, 100 బస్తాల దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. 40 కిలోల బస్తా ప్రస్తుతం రూ.2800 ధర పలుకుతున్నట్లు రైతు చెబుతున్నారు.





వేరుశనగ పంట ఒబ్బిడిలో కూలీలు, (ఇన్‌సెట్) దిగుబడిని చూపుతున్న రైతు హరినాథ్

నేత్రపర్వం .. తిమ్మరాయస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుడుపల్లె: మండలంలోని సంగనపల్లెలోని శ్రీతిమ్మరాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీతిమ్మరాయస్వామి ఉత్సవ మూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అశేషంగా పాల్గొన్న భక్తులు కల్యాణాన్ని కనులారా తిలకించి పులకించారు. రాత్రి గ్రామంలోని పుర వీధుల్లో గ్రామోత్సవం వేడుకగా జరిగింది. ఇంటింటి వద్ద భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు గ్రామంలో ఆదివారం జాతీయ ఆరోగ్య మిషన్ సహకారంతో నేలపల్లె సమీపంలోని సెంబ్‌కార్ప్ సోలార్ పార్కు ప్లాంటు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పుంగనూరుకు చెందిన డాక్టర్ శివప్రసాద్ వైద్య బృందం 300 మందికి బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. టానిక్‌లు, మందులు, సిరఫ్‌లు అందజేశారు. సోలార్ పార్కు మేనేజర్ భరత్‌కుమార్, సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి, పీఎస్ వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ మంజుల తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్యూరిఫైయర్ అందజేత



ప్యూరిఫైయర్‌ను అందజేస్తున్న విద్యార్థులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల బీసీ హాస్టల్‌కు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆదివారం ప్యూరిఫైయర్‌ను వితరణగా అందజేశారు. బీసీ హాస్టల్‌లో సుమారు 190 మంది విద్యార్థులు చదువుతున్నారు. పదవ తరగతిలో 22 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. వీరందరు కలసి రూ.12 వేలు విలువ చేసే ప్యూరిఫైయర్‌ను అందజేశారు. స్కూలుకు తమ గుర్తుగా దీన్ని అందజేసినట్లు పదోతరగతి విద్యార్థులు తెలిపారు. విద్యార్థులను వార్డెన్ సురేష్‌కుమార్ రెడ్డి అభినందించారు.

సర్వే రాళ్లు సిద్ధం

బైరెడ్డిపల్లె: వైఎస్సార్ జగనన్న భూరక్ష పథకంలో భాగంగా రీ సర్వే పూర్తి అయిన నెల్లిపట్ల పంచాయితీ రఘునాయకులదిన్నె రెవెన్యూ గ్రామంలో నాటేందుకు సరిహద్దు రాళ్లు సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ కుమారస్వామి పేర్కొన్నారు. గతంలో ఏళ్ల తరబడి సర్వే చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు రీసర్వేతో ఊరట లభించిందని తెలిపారు. భూములను రోవర్‌తో సర్వే చేసి హద్దులను గుర్తించామన్నారు. రైతులకు ఎలాంటి ఖర్చులు లేకుండా సర్వే రాళ్లను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని తెలిపారు. భూముల సరిహద్దులను గుర్తించేందుకు గతంలో రూ.550 చెల్లించేవారని, ప్రస్తుతం ఉచితంగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు.



రఘునాయకుల దిన్నె వద్ద నాటేందుకు సిద్ధంగా ఉన్న సర్వే రాళ్లు

ధ్యానంతో మానసిక ప్రశాంతత

తవణంపల్లె: ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ బండి శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీవిఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంతోషం కంటే ఆనందం గొప్పదని.. సంతోషం మనస్సుకు సంబంధించినది అయితే ఆనందం ఆత్మకు సంబంధించినదని పేర్కొన్నారు. ప్రకృతికి సంబంధించిన ఏ పనినైనా చేయాలి కానీ విరుద్ధంగా ఏ పని చేయరాదన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన పిరమిడ్ మాస్టర్ సుజనా ధ్యానం వల్ల కలిగే లాభాలను వివరించారు. నిరంతరం ధ్యాన సాధన ద్వారా అతీతమైన శక్తులను పొందవచ్చని అన్నారు. అనుకున్నది సాధించాలన్నా.. శాశ్వతమైన ఆనందాన్ని పొందాలంటే ప్రతి ఒక్కరూ శాఖాహారం భుజించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పిరమిడ్ ఆధ్యాత్మిక సొసైటీ, గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ బి.గోపాలకృష్ణ మూర్తి, కన్వీనర్ రాధిక వక్తలను సత్కరించారు.



ప్రసంగిస్తున్న శ్రీనివాస్‌రావు

భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక గీతాలాపన



భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆస్థాన మండపంలో తిరుపతికి చెందిన సంస్కృతి సంస్థ గాయకులు భక్తిశ్రద్ధలతో భక్తి పాటలను ఆలపించారు. ఆదివారం నిర్వహించిన ధర్మపథం కార్యక్రమంలో సంస్కృతి సంస్థ గాయకులు 108 ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి ఆలయ ఈఓ వెంకటేశు హాజరై కళాకారులను సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన కాణిపాకం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి స్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలి వచ్చారు. దీంతో రూ.150, రూ.100, ఉచిత క్యూలు, స్వామివారి కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



భక్తి పాటలను ఆలపిస్తున్న గాయకులు